27042024-DIS-08_Layout 1 4/27/2024 4:29 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# మలి అడుగు.. మరింత దృఢంగా!



శ్రీశైల్‌రెడ్డి పంజుగుల
90309 97371

**గతంలో నేను టీడీపీలో ఉన్నపుడూ, ఆ తర్వాత తెలంగాణ జన సమితిలో ఉన్నపుడూ కేసీఆర్ బొమ్మ చూసిన ప్రతిసారీ అనుకునేది ఈయన తల అచ్చు తెలంగాణ రూపంలో ఉంది కదా అని. ఈ మాట మీకు సైకోఫ్యాన్సీ లాగా అనిపించవచ్చు కూడా. కానీ, అప్పటి ప్రత్యర్థి పార్టీ నాయకుడి పట్ల నాకీ అభిప్రాయం రావడం కచ్చితంగా ఆయనకు ఒక నికార్సయిన కాంప్లిమెంట్ లాంటిదే.**

**చంద్రబాబు నాతో ఎన్నోసార్లు అనేవారు 'రాజకీయాల్లో ప్రత్యర్థులను విమర్శించడంలో వెరపు ఉండకూడదు. అదే సమయంలో వారి శక్తియుక్తులను గుర్తించడం మరువకూడదు' అని. పబ్లిక్‌గా ఏం మాట్లాడినా... నడుస్తున్న చరిత్రను 'కాలం' లాగా రాగద్వేషాలకు లోనుకాకుండా గమనించడం రాజకీయవాదులకు ఉండవలసిన లక్షణం. ఈ కోణంలో నా ఈ వ్యాఖ్యలను చూడాలి చదువరులు.**

Love him or hate him but you cannot ignore him అంటరు ఇంగ్లీషులో. గతంలో కేసీఆర్‌ను విమర్శించిన మేధావులు, బుద్ధిజీవుల పరిస్థితి ఇదే నేడు తెలంగాణలో. కేసీఆర్‌ను నాడు వ్యతిరేకించినవారు నేడు ఆలోచిస్తున్నరు. ఆయన మరువదగనివాడు అంటున్నరు. 'కేసీఆర్ వల్ల తెలంగాణకు జరగవలసిన మేళ్ళు చాలా ఉన్నయి' అంటున్నరు ఆయనపై శరపరంపర విమర్శలు గుప్పించే సంపాదకులు కూడా!

పదేండ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్‌పై ఏ రోజూ ఒక మంచి మాట అననివారు నాతోనే ఇపుడు అంటున్నరు 'ఆయన ఎంతో చేసిండు తెలంగాణకు. కేసీఆర్ లేని భౌగోళిక తెలంగాణ లేదు, కేసీఆర్ పాత్ర లేని ప్రగతి తెలంగాణ లేదు' అని. మరిపుడు కేసీఆర్ ఆనవాలు లేకుండా చేస్తా అనే మరుగుజ్జుల మాటలు... అందునా తెలంగాణ ఆత్మ లేని వికృత మనస్కులు అంటే నవ్వొస్తున్నది! వారందరికీ దిమ్మతిరిగి బొమ్మ కనపడేలాగ నాలుగు గంటల సినిమా చూపించిండు కేసీఆర్ మొన్న టీవీ9 ఇంటర్వ్యూలో. అది దాన వీర శూర కర్ణ కంటే పెద్ద సినిమా. ఎన్టీఆర్‌వి మూడు పాత్రలైతే, కేసీఆర్‌ది విశ్వరూపం; సాధికార, సగర్వ తెలంగాణ స్వరూపం. నేను దశాబ్దం న్నర కిందటనే అనుకున్న తెలంగాణ కేసీఆర్‌ను పోలి ఉన్నదేమి అని. కేసీఆర్ తెలంగాణను పోలి ఉన్నడు అనడం కూడా అంతే నిజం నేడు.

ఇరవై మూడేండ్ల కింద ఇదే రోజు పుట్టిన తెలంగాణ రాష్ట్ర సమితి బుడిబుడి నడకలలోనే నమోదు చేసుకున్న విజయాలు నేను ఏకరువు పెట్టడం చర్వితచర్వణం అవుతుంది. అవి మీకందరికీ తెలుసు. హిస్టరీని (చరిత్ర) మాత్రమే కాదు, తెలంగాణ భౌగోళిక రాష్ట్ర రూపంలో జాగ్రఫీని సృష్టించిన మహానేత కేసీఆర్. 'కేసీఆర్ ఒక వ్యవస్థ' అని ఆయనే స్వయంగా చెప్పుకోవడం డాంబికం ఏమీ కాదు. అందరూ అట్ల చెప్పుకోలేరు. చెప్పుకోవాలంటే స్వయంగా తాము నమ్మాలి కదా? నమ్మాలంటే గతమూ వర్తమానమూ భవిష్యత్తూ తోడు రావాలి కదా? ఆ మూడింటికీ ప్రియమైన చెలికాడు కేసీఆర్. కాబట్టే అంటున్నది ఆయన ఆనవాలు చెరిపేయడం అంటే అదొక పరిహాసాస్పద, అల్ప విన్యాసం! సర్వభ్రష్టులు మాత్రమే అట్లా మాట్లాడగలరు.

నిజానికి వారి ఆత్మన్యూనతయే (inferiority complex) ఆత్మవిశ్వాస (superioritycomplex) రూపంలో వారినే మోసం చేస్తూ ఉంటుంది. నిరంతరం తనను తాను మోసగించుకొంటూ, తన చుట్టూ ఉండే ఆశావహ అనుచరులనూ, సమాజాన్నీ మోసం చేయ సాహసిస్తున్నడు రేవంత్ రెడ్డి. అది వికటిస్తోందన్న ఎరుక కలిగినపుడు నోటి వెంట బూతులు ధారాళంగా వస్తున్నయి!

**తెలంగాణ ప్రజానీకాన్ని మోసగించి ఇచ్చిన అలవిమాలిన ఎన్నికల హామీలు నేరవేర్చలేమని జ్ఞానోదయమై, పార్లమెంట్ ఎన్నికల భూతం భయపెడుతూ ఉండగా వరుస అబద్ధాలతో జనాలను మభ్యపెట్టాలని చూస్తున్నడు. అధికారం చేతికిచ్చి పాలించండయ్యా అంటే అది చేతగాక పదేండ్ల పాలనలో రంధ్రాన్వేషణ చేస్తున్నడు ఈనాడు, ఆంధ్రజ్యోతి లాంటి మీడియా సహా కొందరు వంకర మనస్కుల దన్నుతో!**

రైతుబంధు, రైతు బీమా, మద్దతు ధర, నాణ్యమైన విద్యుత్తు, సాగునీరు, తాగునీరు సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, దళితబంధు, గురుకులాల రూపంలో అందరికీ అద్భుతమైన చదువు, మండల కేంద్రాల్లో సైతం వైద్య సేవలు, ప్రభుత్వ/ప్రైవేట్‌రంగాల్లో ఉపాధి కల్పన లాంటి విధానాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెంచింది పదేండ్ల బీఆర్ఎస్ పాలన. దేశంలోనే నెంబర్ 1 స్థానం ఊరికే రాలేదు. గాలిలో మాటల మంత్రదండం ఊపితే కాలేదు. ప్రజలపై అపారమైన ప్రేమ, అనితర సాధ్యమైన దార్శనికత, భవిష్యత్తు

**నేడు బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం**




అవసరాలపై అవగాహన, ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉరుకులు పరుగులు పెట్టించే కార్యసాధకత్వం మూర్తీభవించిన పాలకుడైన కేసీఆర్ నిజంగా తెలంగాణకు వరప్రదాయకుడు!

ఇట్లాంటి పదేండ్ల అద్భుత ప్రగతి చిత్రాన్ని వంద రోజుల్లో చెరిపేయగలగడం ఎవరికి సాధ్యం? ఎన్నో రంగుల వెలుగు జిలుగుల తెలంగాణను తుంటరి పెయింటర్ లాగా పిచ్చి రంగులతో మకిలి పట్టించిండు రేవంత్‌రెడ్డి. అయినా... ఆందోళన అవసరం లేదు. వారివి ఉత్తరకుమార చేష్టలు. తెలంగాణ సాధకుని సంకల్పం ముందు అవన్నీ దూదిపింజెలు. ఈ నెల 24 నుంచి మే 10 వరకు కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్రకు వస్తున్న అద్భుత స్పందన, పోటెత్తుతున్న జనం, వారు ఏకరువు పెడుతున్న సమస్యలు, కేసీఆర్ మాత్రమే తమ సమస్యలు తీర్చగలడన్న వారి ఆశాభావం చెపుతున్నయి మూడునెలల మోసపు పాలన గురించి; 420 దొంగ హామీల దగా గురించి!

ఎన్నికల్లో ఓడిపోయి, తుంటి ఎముక విరిగి, మోదీ ప్రతీకార రాజకీయాలకు కూతురు జైలుపాలై, నమ్మిన నాయకులు మోసం చేసినా మానసికంగా కుంగిపోలేదు కేసీఆర్. ఆయన ఆవేదన ఒక్కటే! సంపూర్ణ ఆరోగ్య తెలంగాణ నేడు ఎన్నికల్లో దగాపడి, అభివృద్ధి ఆశలు ఆవిరై, సంక్షేమ సంకల్పం నీరుగారి, భవిష్యత్తు అంధకారమైందన్న విషయం ఆయనను బాధపెడుతున్నది. తన వ్యక్తిగత కష్టాలు దాటి ఆలోచించే నాయకుడాయన. అందుకే నడుంకట్టిండు. ఆయన పట్టుకున్నది చేతికర్ర కాదు; తెలంగాణ బిడ్డల దీవెనల ఊతకర్ర!

నేడు తెలంగాణమంతా ఏకమవుతున్నది. ఎందుకు మాకీ దుర్గతి అని మొన్న కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసినవారు సైతం ఆవేదన చెందుతున్నరు. పాలిచ్చే బర్రెను కాదని, దున్నపోతును తెచ్చుకున్నమని అంగలారుస్తున్నరు. మొన్నటి ఆయన ఇంటర్వ్యూను అది ప్రసారమవుతున్న సమయంలోనే కోటి మందికి పైగా చూసిన్రు. 'బలగం' సినిమా లాగానే ఊళ్ళల్లో పెద్ద స్క్రీన్లు ఏర్పాటుచేసుకుని చూసిన్రు. తమ నాయిన, తమ అన్న, తమ పెద్ద కొడుకు చెప్తున్న మాటలను మనసుతో విన్నరు. కాబట్టే కాంగ్రెస్ ప్రభుత్వానికి బుగులైయితున్నది. కేసీఆర్ అడుగేస్తే అదురుతున్నడు రేవంత్. అందుకే... ఆయన వెంబడే కాలువల నీళ్లు పరుగెట్టుకుంటూ ఒస్తున్నవి; ఆయన వస్తున్నడని తెలిసి మంత్రులు, అధికారులు రైతుల తలుపులు తడుతున్నరు. కేసీఆర్ శక్తి చూసిన జనం ఇపుడు ఆయన యాత్రకు నీరాజనం పడుతున్నరు. ఆయన ఒస్తే సమస్యలు పరిష్కారమవుతాయని, ఆయన వస్తే ప్రభుత్వం ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేయక తప్పదని అనుభవపూర్వకంగా తెలిసిపోయింది. కేసీఆర్‌పై నిందలు వేయాలన్న కసితో ఉన్న నీళ్లు కూడా వదలక పంటలు ఎండబెట్టిన రేవంత్ దుర్మార్గం జనాలకు అర్థమైంది. కాబట్టే కేసీఆర్‌కు మహాదరణ!

ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష నాయకుని పాత్రకు పూర్తి న్యాయం చేస్తున్నరు కేసీఆర్. ఆయనకు మరింతగా జవసత్వాలు ఇవ్వడం ఇపుడు తెలంగాణ బిడ్డల పని. నాడు మహా బలశాలురైన సమైక్య పాలకులనే ఎదిరించి స్వరాష్ట్రం సాధించుకున్న మనం సాధించలేనిది ఏమున్నది?

**సామాజిక సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే; రాజ్యాంగ నిర్మాత, మహనీయుడు బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో తననూ, తన పార్టీనీ, తెలంగాణనూ సర్వతోముఖాభివృద్ధి బాట పట్టిస్తున్న కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు ఇపుడు, రాష్ట్రం సమైక్య పాలనప్పటి కష్టాల్లో కూరుకుపోయినపుడు మనందరం దన్నుగా ఉందాం. బీఆర్ఎస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఘన విజయం చేకూరుద్దాం. కేసీఆర్‌ను మహాబలుడిగా చేద్దాం.**

పుట్టిన రోజు నాడు బీఆర్ఎస్ ఏసయ్య రెండో రాకడను తలపించాలి. మలి అడుగు పడాలి.. మరింత దృఢంగా. ఇది కేవలం పార్టీ నాయకుల కార్యకర్తలకు వదిలివేయకూడదు. ప్రజానీకం బాధ్యతగా తీసుకోవాలి, తెలంగాణ హక్కులకు దఖలు పడాలి!

# గన్‌పార్క్ సాక్షిగా మరో రుజువు



టంకశాల అశోక్

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 26వ తేదీన గన్‌పార్క్‌కు తన రాజీనామా పత్రంతో వెళ్లకపోవటమే మంచిదైంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, వాటి అమలుకు మళ్లీ మళ్లీ పెడుతున్న గడువులు, అన్నీ వట్టి మిథ్య అని ప్రజలకు దానితో తిరుగులేకుండా తెలిసిపోయింది. అదేవిధంగా ఆగస్టు 15 కొత్త గడువుతో దేవుళ్లపై వేసుకుంటున్న ఒట్లు అంతే అబద్ధమని కూడా ప్రజలకు అర్థమైపోయి ఉండాలి.**

రెండు తెలుగు రాష్ర్టాలలో సంచలనంగా మారిన ఆ ఉదంతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆ రోజున, రేవంత్‌రెడ్డి సవాలు ప్రకారమే తన రాజీనామా పత్రాన్ని అడ్వాన్సుగా వెంట తీసుకొని గన్‌పార్క్‌కు వచ్చారు. ఒకే విడతలో రూ.2 లక్షల రైతు రుణమాఫీని, ఆరు గ్యారెంటీలలోని మొత్తం 13 హామీలను ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించిన కొత్త గడువు ఆగస్టు 15లోగా అమలు పరిచినట్టయితే, తను తెచ్చిన రాజీనామా మీడియా వారి ద్వారా ఆటోమేటిక్‌గా స్పీకర్‌కు వెళ్లిపోతుందన్నారు. కానీ రేవంత్‌రెడ్డి హరీశ్‌కు సవాలు అయితే విసిరారు గాని, తన లేఖతో తాను స్వయంగా గన్‌పార్క్‌కు రాలేదు. కనీసం తన సిబ్బందితో అయినా పంపలేదు. ఈ వ్యాసం రాసే సమయానికి ఎటువంటి ప్రకటన కూడా చేయలేదు. దీన్ని బట్టి, ప్రజలకు ఆయన హామీలు, గడువులు అన్నీ మిథ్య, దేవుళ్లపై ఒట్లు వట్టి అబద్ధమని స్పష్టంగా అర్థమవుతున్నది. ఇదంతా ప్రజలు స్వయంగా టీవీ చానళ్లలో చూసిందే.

కాంగ్రెస్ హామీలపై ప్రజలకు అడుగుబొడుగు ఆశలు, భ్రమలు ఇంకా ఏమైనా మిగిలి ఉంటే, అవి శుక్రవారం నాడు ఈ విధంగా పటాపంచలై ఉండాలి. ఈ ఉదంతంపై రానున్న రోజుల్లో ప్రజల మధ్య ముమ్మరంగా చర్చలు జరుగుతాయి. ఇదంతా



కాంగ్రెస్ పార్టీ, దానితో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కొని తెచ్చుకున్న ముప్పు. కాంగ్రెస్ పార్టీ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీలతో అధికారానికి వచ్చిందని, కనుక ఇక్కడ కూడా అదేవిధంగా గ్యారెంటీలిస్తే గెలిచి తీరుతామని వారు నమ్మారు. కాని అందులో అనేకం అమలుకు సాధ్యం కావని పలువురు నిపుణులు, విజ్ఞులు కర్ణాటకలో చెప్పారు, తెలంగాణలో కూడా హెచ్చరించారు. కర్ణాటక ఎన్నికలు జరిగి ఈ నెలతో ఏడాది అవుతున్నది. అక్కడి హామీలు అనేకం ఇప్పటికీ అమలుకావటం లేదు. కొన్ని అరకొరగా మాత్రమే అమలవుతున్నాయి. దానితో ప్రజలలో నిరసనలు పెరుగుతున్నాయి. అప్పటి ఎన్నికల్లో అనేక ప్రజాసంఘాలు కలిసి కాంగ్రెస్‌కు మద్దతునిచ్చాయి. దానితో పాటు కాంగ్రెస్ గ్యారెంటీలు, అంతకుముందటి బీజేపీ ప్రభుత్వంపై ఉండిన వ్యతిరేకత కలిసి కాంగ్రెస్‌ను గెలిపించాయి. కానీ హామీలు నెరవేరకపోవటంతో అవే సామాజిక సంఘాలకు చెందిన ప్రముఖులు ఇప్పుడు అంటున్నదేమిటి?

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు కాంగ్రెస్‌కు ఇచ్చిన మద్దతు ఒక 'కాంట్రాక్టు' వంటిది. దాని ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం తన హామీలను అమలు పరచాలి. దానితో పాటు మంచి పరిపాలనను ఇవ్వాలి. అవినీతిని అరికట్టాలి. కాని, ఈ మూడింటిలో ఏదీ సరిగా జరగటం లేదు. హామీలకు నిధులు లేవని మంత్రులు స్వయంగా అంగీకరిస్తున్నారు. అందువల్ల ప్రజలకు కాంగ్రెస్‌తో ఏర్పడిన 'కాంట్రాక్టు' ముగిపోయినట్టే. ఈ స్థితిలో ప్రజలకు ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలనే నిర్ణయమైతే ఇంకా ఏమీ తీసుకోలేదు గాని, అసెంబ్లీ ఎన్నికలప్పటి వలె కాంగ్రెస్‌కు కట్టుబడి ఏమీ లేరు. సామాజిక సంఘాల ప్రముఖుల నుంచి వినవస్తున్న మాట ఇది.


తెలంగాణలో వరుసగా పదేండ్ల పాటు అధికారం లేక, ఏ విధంగానైనా గెలిచితీరాలని తపిస్తుండిన కాంగ్రెస్, కర్ణాటక తరహాలోనే వెనుక ముందు ఆలోచించకుండా అలవిగాని హామీలిచ్చింది. వాటి అమలుకు మొత్తం రాష్ట్ర బడ్జెట్ కూడా సరిపోదని, అంతకుమించి మరొక 50 శాతం నిధులు అవసరమవుతాయని, అవెక్కడ తెస్తారని, పరిపాలనకు కావలసిన తక్కిన ఖర్చుల మాటేమిటని, అభివృద్ధి పనులెట్లా అని, ఎన్నికల ప్రచారం సమయంలోనే ప్రశ్నలు వినిపించాయి. హామీలకు అయ్యే ఖర్చెంతో అంచనాలు చెప్పాలని ఆర్థిక నిపుణులు కాంగ్రెస్‌ను కోరారు. కానీ ఏమి చేసైనా సరే అధికారానికి రావాలనే ఆతృతలో ఉండిన పార్టీ నాయకత్వం దేనికీ జవాబివ్వలేదు. రకరకాల డిక్లరేషన్లు, మ్యానిఫెస్టోలు ఎడాపెడా ప్రకటించటమే గాక, పత్రికలలో పూర్తి పేజీ అడ్వర్టయిజ్‌మెంట్లతో, బహిరంగసభ ప్రసంగాలతో చాలా హడావుడి చేశారు. ఆరు గ్యారెంటీలు, 13 హామీలను గత ఎన్నికల ప్రచారాలలో ఎప్పుడూ ఏ పార్టీ చేయని విధంగా బాండ్‌పేపర్లపై రాసి ఇంటింటికి పంచిపెట్టారు. వాటిపై ప్రజలకు మరింత నమ్మకం కలిగించటం కోసం డిక్లరేషన్ పత్రాలను రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీలతో విడుదల చేయించారు. ఆరు గ్యారెంటీలను 100 రోజులలో అమలుపరిచే బాధ్యత స్వయంగా తనదంటూ సోనియాగాంధీతో రాష్ట్ర ప్రజలకు బహిరంగ లేఖ రాయించారు. అంతకుముందు వరకు కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన అనేక హామీలను గణనీయంగా పెంచివేసి, వాటికి కొత్త హామీలు చేర్చి, ప్రజలను నమ్మించటం వీటన్నింటి ఉద్దేశం.

ఈ వ్యూహంతో కాంగ్రెస్ గెలిచిన మాట నిజమే. కానీ, ఆ వ్యూహమన్నది చివరికి కాంగ్రెస్‌ను తన గోయి తానే తవ్వుకునేట్టు చేసింది. అమలుచేయలేని ఆ హామీలు ముందు నుయ్యి వెనుక గొయ్యి వలె మారాయి. కర్ణాటకలో జరుగుతున్నదే ఇక్కడ కూడా మొదలైంది. కర్ణాటక ప్రజా సంఘాల ప్రముఖులు అక్కడి

**ప్రభుత్వం మాత్రం అస్పష్టమైన ప్రకటనలు చేయటం మినహా, హామీల అమలుపై ఆడిటింగ్ పద్ధతిలో లెక్కలేమీ చెప్పటం లేదు. కాకపోతే రెండు మాటలు మాత్రం అనుకోవాలి. రైతు రుణమాఫీకి, ఆరు గ్యారెంటీలలోని 13 హామీల అమలు హరీశ్ గుర్తు చేస్తున్న ఆగస్టు 15 గడువునైనా ఆమోదించేందుకు ముఖ్యమంత్రి సిద్ధంగా లేరని ఇప్పుడు స్పష్టమవుతున్నది.**

పరిస్థితి గురించి అంటున్న విధంగానే, ఇక్కడ తెలంగాణలో కూడా ప్రజలకు కాంగ్రెస్‌తో అసెంబ్లీ ఎన్నికల నాటి 'కాంట్రాక్ట్' ముగిసిపోతున్నదనే అభిప్రాయం కలుగుతున్నది. అందుకు తార్కాణాలు ఒక్కొక్కటిగా కన్పిస్తున్నాయి కూడా. ఈ క్రమంలోని ఒక నాటకీయ పరిణామమే రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావుల మధ్య సాగిన సవాళ్లు, ప్రతి సవాళ్లు, గన్‌పార్క్ ఉదంతాలు.

తేదీలు ప్రకటించి మరీ ప్రభుత్వం ఏ వర్గానికి ఇచ్చిన హామీలు ఏమిటో, ఆ గడువు నాటికి జరిగిందేమిటో, జరగనిదేమిటో, తిరిగి పెడుతున్న కొత్త గడువులు ఏమిటో ఇప్పటికే విస్తారంగా మీడియాలో వెలువడ్డాయి. అంతకన్నా ముఖ్యంగా ప్రజల మధ్య ప్రతి గ్రామంలో చర్చలు సాగుతున్నాయి. అందువల్ల ఇక్కడ మరొకమారు వివరించనక్కర లేదు. ప్రభుత్వం మాత్రం అస్పష్టమైన ప్రకటనలు చేయటం మినహా, హామీల అమలుపై ఆడిటింగ్ పద్ధతిలో లెక్కలేమీ చెప్పటం లేదు. కాకపోతే రెండు మాటలు మాత్రం అనుకోవాలి. రైతు రుణమాఫీకి, 6 గ్యారంటీలలోని 13 హామీల అమలు హరీశ్ గుర్తుచేస్తున్న ఆగస్టు 15 గడువునైనా ఆమోదించేందుకు ముఖ్యమంత్రి సిద్ధంగా లేరని ఇప్పుడు స్పష్టమవుతున్నది. కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల తర్వాత, స్థానిక సంస్థల ఎన్నికల గండం కూడా ఆగస్టు 15 నాటికి ముగిసే అవకాశం ఉన్నది. అయినప్పటికీ రుణమాఫీ, 13 హామీల అమలుపై ముఖ్యమంత్రికి తనపైన తనకే భరోసా ఉన్నట్టు లేదు.. అటువంటప్పుడు ఆయన పట్ల ప్రజలకెట్లా భరోసా కలగాలి? శుక్రవారం నాడు ముఖ్యమంత్రి గన్‌పార్క్‌కు రాకపోవటంతో, ఆగస్టు 15కు కూడా రుణమాఫీతో పాటు 6 గ్యారెంటీల అమలు పూర్తిచేయలేమని చెప్పకనే చెప్పినట్టయింది.




## ఇదా దేశానికి తెచ్చే కీర్తి?



*మోదీ మరోసారి దేశానికి కీర్తి తెచ్చారు! భారత్‌లో మానవ హక్కుల హననం జరుగుతున్నదని, మైనారిటీల మీద దాడులు జరుగుతున్నాయని అమెరికా హోం శాఖ నివేదిక వెల్లడించింది. విశ్వగురుతో పాటు ఇంకెవరైనా ఈ విషయాన్ని పట్టించుకుంటున్నారా?*

**- సాగరికా ఘోష్,** తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ

## ఎటమటం




### ఇచ్చిందెంత? నొక్కిందెంత?

ఎమ్మెల్యే ఎన్నికల్లో ఖర్చుపెట్టిన డబ్బులకు తగ్గట్టుగా ఓట్లు వచ్చాయా, లేదా? అని లెక్క తేల్చే పనిలో పడ్డారు మంత్రి జూపల్లి కృష్ణారావు. ఏ మండలానికి ఎన్ని డబ్బులు పంపింది, అందులో ఎంత ముట్టింది? అని పనిలో పనిగా పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు ఆయన ఆరా తీస్తున్నారు. ఎక్కువ డబ్బులు పంపిన చోటనేమో తక్కువ ఓట్లు, తక్కువ డబ్బులు పంపిన చోటనేమో ఎక్కువ ఓట్లు రావడం పట్ల జూపల్లికి అనుమానం వచ్చింది. దీంతో పంచాల్సిన డబ్బులు మధ్యలో నొక్కిసిన అనుచరుల బండారం బయట పడటంతో వారు మొకం చాటేస్తున్నారట. ఈ కూపీ లాగడం ఇప్పుడు అవసరమా? దీని వల్ల తనకు నష్టం జరిగే ప్రమాదం లేకపోలేదని ఎంపీ అభ్యర్థి మల్లు రవి ఆందోళన చెందుతున్నట్టు వినికిడి.



### ఆ సంగతి చూడు ముందు

వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిపై పార్టీ పెద్దలు గుర్రుగా ఉన్నారట. ఒకవైపు ఎంపీ ఎన్నికలు జరుగుతుంటే గాలికి వదిలేసి గాంధీభవన్‌లో జగ్గన్న టైమ్ పాస్ చేస్తున్నారనీ మండి పడుతున్నారు. నెహ్రూ, ఇందిరమ్మ, రాజీవ్‌గాంధీ హయాంలో అలా జరిగింది, ఇలా జరిగిందని మీడియా వాళ్ల మెదడు తింటున్నారని ఎవరో ఫిర్యాదు కూడా చేశారట. దీంతో నెహ్రూ సంగతి తర్వాత ముందు పార్టీ అభ్యర్థి సంగతి చూడండి అని పెద్దలు సూచించినట్టు సమాచారం.



### కర్మ కాకపోతే..?

గేట్లు తెరిచినా ఎమ్మెల్యేల నుంచి పెద్దగా స్పందన కనిపించలేదు. దీంతో చోటా మోటా నాయకులు ఎవరు వచ్చినా చేర్చుకోమని కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశించింది. చివరికి మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రెబల్స్‌గా పోటీ చేసి పార్టీ ఓటమికి కారణమైన వారు వచ్చినా చేర్చుకోవాల్సిందే అని స్పష్టం చేసింది. ఖర్మ ఏం చేస్తాం నా ఓటమికి కారణమైన వాడి మెడలో నేనే కండువా కప్పాల్సి వచ్చిందని చేరికల కమిటీ నాయకుడు జగ్గన్న వాపోయారు.



### బొమ్మలు పెట్టుకోక తప్పలేదు

బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు గతంలో దుబ్బాక ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు, నేనేమీ మోదీ, అమిత్ షా బొమ్మలు పెట్టుకొని గెలువలేదని ఢిల్లీలో మీడియా చిట్‌చాట్‌లో చేసిన వ్యాఖ్యలు వివాదమయ్యాయి. ఇప్పుడు అదే రఘునందన్ రావు తరపున ప్రచారం చేయడానికి ప్రధాని మోదీ, అమిత్ షా ఇద్దరూ వస్తున్నారు. గెలిస్తే సరి, ఓడితే మటుకు వారి బొమ్మలు పెట్టుకోవడం వల్లనే తాను ఓడిపోయానని రఘునందన్ అంటారేమో చూడాలి మరి.

**- వెల్జాల**